సాక్షి
సూర్యాపేట
సోమవారం । 20 । జనవరి । 2025



స్పష్టత ఇవ్వాలి
ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు పెంపుపై స్పష్టత ఇవ్వాలని డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య కోరారు. - 8లో



ఆపదలో భరోసా
తుంగతుర్తికి చెందిన మేరుగుమల్ల రాజ్ ప్రాణదాత ఫౌండేషన్ ఏర్పాటుచేసి ఎందరికో అండగా నిలుస్తున్నారు. - 8లో



సమతారాజ్య స్థాపనకు కృషి
సమతారాజ్య స్థాపనకు కృషిచేయాలని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. - 10లో

ఫ్లైఓవర్ గుబులు!

అర్వపల్లిలో 365, 365బీ హైవేలు కలిచే చోట నిర్మాణానికి ప్రతిపాదన



అర్వపల్లిలో ఫ్లైఓవర్ నిర్మించేందుకు ప్రతిపాదించిన స్థలం ఇదే..

- సర్వే కూడా మొదలు పెట్టిన అధికారులు
- నిర్మిస్తే 200 ఇళ్లకు జరగనున్న నష్టం
- గతంలోనే రద్దు చేసి మళ్లీ ఏమిటని ప్రశ్నిస్తున్న స్థానికులు
- వద్దే వద్దంటూ ఆందోళన బాట



ఫ్లైఓవర్ నిర్మాణం కోసం సర్వే చేస్తున్న సిబ్బంది

అర్వపల్లి: సూర్యాపేట–జనగామ, నకిరేకల్–తానంచర్ల రెండు జాతీయ రహదారులకు ప్రధాన కూడలి అయిన జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లిలో ఫ్లైఓవర్ నిర్మించాలని మళ్ల ప్రతిపాదన రావవడంతో స్థానిక ప్రజల్లో టెన్షన్ మొదలైంది. గతంలోనే ఇక్కడ ఫ్లైఓవర్ నిర్మాణానికి ప్రతిపాదనలు వెళ్లాయి. సర్వే సందర్భంగా విషయం బయటకు రావడంతో స్థానికులు అప్పట్లో ఆందోళన బాటపట్టారు. ఇక్కడ అవసరం లేని ఫ్లైఓవర్ నిర్మాణం ఎందుకంటూ ప్రజలు రాజకీయాలకు అతీతంగా ఏకమై ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. దీంతో అధికారులు, ప్రజాప్రతినిధులు ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రతిపాదనను రద్దు చేయించారు.

ఇప్పటికే నష్టపోయిన ప్రజలు

గతంలో అర్వపల్లిలో 365, 365బీ రెండు జాతీయ రహదారుల విస్తరణ సందర్భంగా ఐదేళ్ల క్రితం 200 ఇళ్లు కొన్ని పాక్షికంగా, మరికొన్ని పూర్తిగా తొలగించారు. అయితే ఇక్కడ పూర్తిగా దేవాదాయశాఖ భూమి కావడంతో ఇళ్ల యజమానులకు స్థలానికి సైతం నష్ట పరిహారం రాలేదు. కేవలం ఇళ్లకు మాత్రమే పరిహారం అందిచడంతో ఇళ్లు, దుకాణాల యజమానులు తీవ్రంగా నష్టపోయారు. రెండు హైవేల విస్తరణ పూర్తయిన ఏడాదికే అప్పట్లో 365 హైవేపై స్థానికంగా ఫ్లైఓవర్ నిర్మించాలని అధికారులు సర్వే మొదలు పెట్టడంతో ప్రజల ఆందోళన మూలంగా విరమించుకున్నారు.

మళ్లీ తెరపైకి ఫ్లైఓవర్

అర్వపల్లిలో జాతీయ రహదారుల విస్తరణ పూర్తయ్యాక వై జంక్షన్‌ను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని హైవే అధికారులు అప్పట్లో ప్రకటించారు. కానీ, ఇంత వరకు జంక్షన్ అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఇదిలా ఉంటే ఇక్కడ ఎలాంటి అవసరం లేని ఫ్లైఓవర్ నిర్మాణ ప్రతిపాదన మళ్లీ తెరపైకి తెచ్చారు. అర్వపల్లిలో రెండు రోజులుగా హైవే అధికారులు సర్వే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సర్వేను సీతారాంపురం సమీపంలోని 71డీబీఎం కాలువ వద్ద నుంచి తుంగతుర్తి రోడ్డు వెంట వై జంక్షన్ మీదుగా జాజిరెడ్డిగూడెం రోడ్డులో ముదిరాజ్ కాలనీ సమీపం వరకు సర్వే చేపట్టారు. ఈ రోడ్డులోని సుమారు 200 ఇళ్లు, దుకాణాలను బ్రిడ్జి నిర్మాణంలో కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. అయితే ఈ యజమానులంతా గతంలోనే రోడ్డు విస్తరణలో ఇళ్లు, దుకాణాలు కోల్పోయి అప్పులు చేసి మరీ కొత్తగా నిర్మించుకున్నారు. మరికొందరు ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ క్రమంలోనే హైవే అధికారులు ఒక్కసారిగా మళ్లీ ఫ్లైఓవర్ అంటుండడంతో తామేం పాపం చేశామంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫ్లై ఓవర్ యోచనను విరమించుకొని వై జంక్షన్‌ను అభివృద్ధి చేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులను వేడుకుంటున్నారు. ఇక్కడ ఎలాంటి అవసరం లేని ఫ్లైఓవర్ నిర్మాణం వద్దని ముక్తకంఠంతో అంటున్నారు. ఫ్లై ఓవర్ నిర్మాణం వద్దంటూ ఆందోళన బాట పట్టారు.

రూ.20 లక్షలు నష్టపోయా



గతంలో హైవే విస్తరణ సందర్భంగా రూ.20లక్షల విలువ చేసే ఇంటిని కోల్పోయాను. ఇటీవలె తన వ్యవసాయ భూమి కొంత అమ్మి మళ్లీ కొత్తగా ఇల్లు కట్టుకున్నాను. ఫ్లైఓవర్ నిర్మాణం జరిగితే మళ్లీ కొత్తగా కట్టుకున్న ఇళ్లు కూడా కోల్పోతాను.
– కట్టెల కృష్ణ, అర్వపల్లి

ఇల్లు పోద్దని భయంగా ఉంది



365 హైవే వెంట జాజిరెడ్డిగూడెం రూట్లో రూ.40లక్షలతో కొత్తగా ఇంటిని నిర్మించుకుంటున్నా. ఈ తరుణంలో ఫ్లైఓవర్ నిర్మాణమని నా ఇంటి ముందు నుంచే సర్వే చేశారు. ఇంతగానం కష్టపడి కట్టుకుంటున్న ఇల్లు పోద్దనే భయంగా ఉంది.
– గజ్జి శంకర్, అర్వపల్లి

ప్రజలకు అవసరం లేనిది ఎందుకు



మా స్వగ్రామం జాజిరెడ్డిగూడెం. ఇటీవల అర్వపల్లిలోని తుంగతుర్తి రోడ్డులో కొత్త ఇల్లు కట్టుకున్నాను. ఫ్లైఓవర్ నిర్మాణానికి సర్వే చేశారు. ఫ్లైఓవర్ నిర్మిస్తే ఇల్లు పోయే అవకాశం ఉంది. ప్రజలకు అవసరం లేని ఫ్లైఓవర్ నిర్మాణ ప్రతిపాదనను విరమించుకోవాలి.
– కోటమర్తి శ్రీనివాస్

ఫ్లై ఓవర్ వద్దంటూ నిరసన



అర్వపల్లిలో నిరసన తెలుపుతున్న స్థానికులు

అర్వపల్లి: అర్వపల్లిలో ఎలాంటి అవసరంలేని ఫ్లై ఓవర్ నిర్మించవద్దంటూ స్థానికులు ఆదివారం స్థానిక వై జంక్షన్‌లో హైవేపై నిరసన వ్యక్తం చేశారు. ఫ్లైఓవర్ నిర్మించి తమ జీవితాలను రోడ్డుపాలు చేయవద్దంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మాజీ జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ మాట్లాడుతూ మూడేళ్ల కిందటే రెండు హైవేల విస్తరణ సందర్భంగా వందలాది మంది ఇళ్లు, దుకాణాలు కోల్పోయి తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. ఇక్కడ ఫ్లైఓవర్ నిర్మిస్తే కొత్తగా ఇళ్లు, దుకాణాలు నిర్మించుకున్న వారు మరలా నష్టపోతారన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేలు వెంటనే చొరవ తీసుకొని ఫ్లైఓవర్ నిర్మాణ యోచనను విరమించుకునేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈదుల వీరపాపయ్య, వనం రమేష్, మామిడాల రాజలింగం, దావుల లింగయ్య, గజ్జి శంకర్, డాక్టర్ కిరణ్, కె. నరేష్, పెద్దయ్య, కట్టెల కృష్ణ, నల్లగుంట్ల శ్రీనివాస్, బైరబోయిన సంతు, గిరి, పి. శ్రీనివాస్, కుంభం వెంకన్న, వేణు, అనిల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సర్వేను పక్కాగా నిర్వహించాలి



నూతనకల్‌లో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

నూతనకల్, మద్దిరాల: రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన చేపట్టిన సర్వేను పక్కాగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. ఆదివారం నూతనకల్, మద్దిరాల మండలం పోలుమల్లలో సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సేద్యానికి పనికిరాని భూములను గుర్తించి నివేదికను తయారు చేయాలన్నారు. సాగు భూములకే రైతు భరోసా పడేలా చూడాలని ఆదేశించారు. ఆయనవెంట ఆయా మండలాల తహసీల్దార్లు ఎం.శ్రీనివాసరావు, అమీన్‌సింగ్, డీఈ చంద్రశేఖర్, అధికారులు పాల్గొన్నారు.

సర్వేల వల్లే అర్హులకు పథకాలు అందట్లే..



మాట్లాడుతున్న మల్లు నాగార్జున్‌రెడ్డి

హుజూర్‌నగర్: ప్రభుత్వం చేస్తున్న సర్వేల వల్ల అర్హులైన పేదలు సంక్షేమ పథకాలు అందట్లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం హుజూర్‌నగర్‌లోని అమరవీరుల స్మారక భవన్‌లో నిర్వహించిన ఆ పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులందరికీ పథకాలు అందించాలని, రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జనవరి 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో జరిగే సీపీఎం 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు కొలిశెట్టి యాదగిరి రావు, ములకలపల్లి రాములు, మట్టిపల్లి సైదులు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, జిల్లా, మండల, పట్టణ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

కూలీలకు పనులు కల్పించాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ అప్పారావు

మునగాల: ఉపాధిహామీ పథకం కింద ఎక్కువ మంది కూలీలకు పనులు కల్పించేలా చర్యలు చేపట్టాలని డీఆర్‌డీఓ వి.అప్పారావు సూచించారు. ఆదివారం ఆయన మునగాల ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధిహామీ పనులకు సంబంధించిన అకౌంట్స్ డేటా ఎంట్రీ, పనుల ప్రగతి నివేదికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతిఒక్కరి ఆధార్, బ్యాంకు అకౌంట్ సీడింగ్ త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. గ్రామసభల నిర్వహణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, ఏపీఓ శైలజ, ఉపాధిహామీ టీఏలు, ఎఫ్‌లు పాల్గొన్నారు.

జాతీయ భావాలు పెంపొందించాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

సూర్యాపేట టౌన్: పాఠశాల స్థాయిలో విద్యార్థుల్లో జాతీయ భావాలు, నైతిక విలువలు పెంపొందించాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ నల్లగొండ విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ బంటు జనార్దన్ జీ అన్నారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నగర సంఘ చాలక్ డాక్టర్ దాచేపల్లి సుధీర్ జీ, బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ దండ మురళీధర్‌రెడ్డి, టీపీయూఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెల్లంకొండ రామ్మూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగంపల్లి హరిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి యామా రమేష్, శ్రీధర్, సంతోష్‌కుమార్, జితేందర్‌రెడ్డి, శ్రీదేవి, శ్రీనివాస్‌రెడ్డి, రామినేని శ్రీనివాస్, శైలజ ,సోమశేఖర్, శ్రీనివాస్‌రావు, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

రేషన్ కార్డుదారులందరికీ సన్నబియ్యం



హుజూర్‌నగర్‌లోని హౌసింగ్ కాలనీలో పనులను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్: రేషన్ కార్డుదారులందరికీ సన్నబియ్యం అందజేస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం హుజూర్‌నగర్ హౌసింగ్ కాలనీ వద్ద రూ.14 కోట్లతో నిర్మించనున్న ఐటీఐ భవన నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలోని చదువుకున్న యువత కోసం అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్ పనులు మొదలు పెట్టామని, ఇప్పుడు ఐటీఐ బిల్డింగ్‌కు శంకుస్థాపన చేశామన్నారు. దీనివలన ఎంతోమంది నిరుద్యోగులు ఉద్యోగాలు పొందగలుగుతారని మంత్రి అన్నారు. అర్హులైన అందరికీ రేషన్ కార్డులు అందించాలనేదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సంక్షేమ పథకాల కోసం గతంలో మీ సేవ కేంద్రాల్లో, ప్రజావాణిలో, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నా పరిగణనలోకి తీసుకుని, వాటిని పరిశీలిస్తామన్నారు. హుజూర్‌నగర్ హౌసింగ్ కాలనీని రాష్ట్రంలోనే ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కాలనీ తన పదేళ్ల తపస్సు అని, త్వరలో అన్ని బ్లాకుల పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలో ఎక్కడ కూడా సింగిల్ రోడ్డు ఉండకుండా అన్ని డబుల్ రోడ్లుగా మార్చి ప్రజలకు సౌకర్యవంతంగా చేయాలని పేర్కొన్నారు. అన్ని గ్రామాలకు డబుల్ రోడ్లు, సాగునీరు, తాగునీరు అందించడమే తన ధ్యేయమన్నారు. జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలకు క్షేత్రస్థాయిలో అధికారులు సర్వే నిర్వహించారని, లబ్ధిదారుల జాబితాను ఈనెల 21 నుంచి 24 వరకు జరిగే గ్రామసభల్లో ప్రదర్శిస్తారని తెలిపారు. జాబితాలో తమ పేర్లు లేని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, గ్రామ సభలో దరఖాస్తులు అందజేయవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈనెల 26 నుంచి నాలుగు పథకాలు అమలు పరుస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఈఈ సీతారామయ్య, ఆర్‌డీఓ శ్రీనివాసులు, ఉపాధి, శిక్షణ శాఖ ఆర్‌డీడీ ఎస్.రాజా, ప్రిన్సిపాల్ జింజిరాల వెంకన్న, మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చన రవి, వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్, అధికారులు ప్రజాప్రతినిధులు సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగం పూర్తిస్థాయి అమలుకు పోరు

- టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం



సెమినార్‌లో మాట్లాడుతున్న కోదండరాం

భానుపురి (సూర్యాపేట): భారత స్వాతంత్య్ర సంగ్రామ ఆకాంక్షల ప్రతిబింబమే భారత రాజ్యాంగమని, దాని పూర్తిస్థాయి అమలుకు మరో పోరాటం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలంగాణ జనసమితి (టీజేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. 75 ఏళ్ల భారత రాజ్యాంగం, గమ్యం, గమనం అనే అంశంపై ఆదివారం సూర్యాపేటలో ప్రజాస్వామిక వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సెమినార్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారత రాజ్యాంగం ఎంతో శాస్త్రీయంగా ఎంతో మేధోమధనంతో చర్చలు జరిపిన అనంతరం అమలులోకి వచ్చిందన్నారు. సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ చైర్మన్ మల్లెపల్లి లక్ష్మయ్య మాట్లాడుతూ డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ ఏ ఒక్కరికీ సంబంధించిన వ్యక్తి కాదన్నారు. అన్ని వర్గాల ప్రజలు అనుభవిస్తున్న ఓటు హక్కు అంబేద్కర్ ఎంతో సాహసంతో కొట్లాడి రాజ్యాంగంలో పొందుపర్చిన అంశమని చెప్పారు. అంతకుముందు సూర్యాపేటలోని తెలంగాణతల్లి విగ్రహం వద్ద మలిదశ తెలంగాణ అమరవీరుడు కొండేటి వేణుగోపాల్‌రెడ్డి వర్ధంతిలో కోదండరాం పాల్గొని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నల్సార్ యూనివర్సిటీ న్యాయ శాస్త్ర ఆచార్యులు మాడభూషి శ్రీధర్, తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్, తండు నాగరాజుగౌడ్, కిరణ్, కొంచెం చంద్రకాంత్, గోపి తదితరులు పాల్గొన్నారు. అలాగే వర్ధంతి కార్యక్రమంలో నాయకులు బైరి రమేష్, బొడ్డు శంకర్, జాటోతు శ్రీను, కొల్లు కృష్ణారెడ్డి, వినయ్‌గౌడ్, సూర్యనారాయణ, ఏనుగు మధుసూదన్, యాకోబురెడ్డి, సతీష్, ఫరీదుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కోదాడలో ఆధునిక బస్‌స్టేషన్

రూ.17.95 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం

- డిపో గోడవైపు బస్టాండ్ నిర్మాణం
- హైవే వైపు మల్టీ షాపింగ్ కాంప్లెక్స్
- ప్రయాణికులకు సకల సౌకర్యాలు
- త్వరలోనే సిద్ధంకానున్న ప్లాన్



కోదాడ ఆర్టీసీ బస్టాండ్

కోదాడ: కనీస సౌకర్యాలకు నోచుకోని కోదాడ ఆర్టీసీ బస్టాండ్ దశ తిరగనుంది. గత నెలలో కోదాడ బస్టాండ్‌ను పరిశీలించిన రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆధునిక బస్టాండ్ నిర్మాణానికి హామీ ఇచ్చారు. శనివారం ఆధునిక బస్‌స్టేషన్ నిర్మాణానికి రూ.17.95 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈనిధులతో బస్టాండ్, ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంతోపాటు మల్టీస్టేర్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టనున్నారు. స్వయంగా ఆర్కిటెక్చరైన కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి బస్టాండ్ నిర్మాణం ప్రత్యేకత ఉండేలా ప్లాన్ తయారు చేయనున్నట్లు సమాచారం.

డిపో గోడవైపు మూడంతస్తుల్లో బస్టాండ్..

ప్రస్తుతం కోదాడ బస్టాండ్ అస్తవ్యస్తంగా తయారైంది. చాలా స్థలం ఖాళీగా ఉండడంతో మలమూత్ర విసర్జన చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కొత్తబస్‌స్టేషన్ నిర్మించాలని భావిస్తున్నారు. దీంతో ప్రస్తుతం ఉన్న బస్టాండ్‌ను కొంతకాలం పాటు అలాగే ఉంచి డిపో గోడవైపు ఉత్తరముఖంగా మూడు అంతస్తులతో బస్టాండ్‌ను నిర్మించనున్నారు. కింది అంతస్తులో ప్లాట్ ఫాంల నిర్మాణం, విశ్రాంతి గదులు, రెండవ అంతస్తులో అధికారుల కార్యాలయాలు, మూడవ అంతస్తులో సిబ్బంది విశ్రాంతి గదులు నిర్మించనున్నట్లు తెలిసింది.

రోల్ మోడల్‌గా ఉంటుంది



రాష్ట్రంలోనే అన్ని బస్టాండ్‌లకు రోల్ మోడల్‌గా ఉండేలా కోదాడ ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం చేయిస్తాను. త్వరలోనే ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి దీని నిర్మాణంపై ప్రణాళిక తయారు చేయిస్తాను. ఇచ్చిన మాట ప్రకారం కోదాడ పట్టణ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నాను.
– నలమాద పద్మావతిరెడ్డి, కోదాడ ఎమ్మెల్యే

ముందువైపు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం

కొత్త బస్టాండ్ భవన నిర్మాణం పూర్తయిన తరువాత ప్రస్తుత బస్టాండ్, డ్రైవర్ల విశ్రాంతి భవనం, ముందు వైపుఉన్న షాపింగ్ కాంప్లెక్స్, ఇతర దుకాణాలను పూర్తిగా కూల్చివేసి బహుళ అంతస్తులతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేయనున్నారు. హైవేవెంట ఉండడంతో దుకాణాలు ఏర్పాటుచేసి ఆదాయం సమకూర్చుకోవాలని ఆర్టీసీ అధికారులు యోచిస్తున్నారు. బస్టాండ్ ఆవరణలో ప్రయాణికుల కోసం ఆధునిక హంగులతో గార్డెన్ కూడా నిర్మించాలని ప్రతిపాదించినట్లు తెలిసింది.

హుజూర్‌నగర్‌లో కొత్త బస్టాండ్ నిర్మాణానికి రూ.3.57 కోట్లు

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లోఆర్టీసీ కొత్త బస్టాండ్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.3.57 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఇటీవల హుజూర్‌నగర్‌కు వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కొత్త బస్టాండ్ శిథిలావస్థకు చేరిన దుస్థితిని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వివరించారు. కొత్త బస్టాండ్ కట్టాలని, అదనపు ప్లాట్ ఫారాలు ఆధునిక హంగులతో నిర్మించాలని పొన్నంకు విన్నవించారు. దీంతో మంత్రి నిధులు మంజూరు చేశారు.

‘మీ టికెట్’లో మన ప్రాంతం

- ఆలయాలు, విహారయాత్రల వివరాలు తెలిపేలా ప్రత్యేక యాప్
- వాటి విశేషాలు, టికెట్ రేట్లు తెలుసుకునే అవకాశం
- ఆ యాప్‌లో నాగార్జునసాగర్, యాదగిరిగుట్ట, మిర్యాలగూడకు చోటు



నాగార్జునసాగర్ : రాష్ట్రంలోని దేవాలయాల్లో దైవదర్శనాలు, విహారయాత్రల విశేషాలను తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ‘మీ టికెట్’ యాప్‌ను తీసుకొచ్చింది. తెలంగాణలోని అన్ని ప్రముఖ దేవాలయాల్లో దర్శనం, పార్కులు, కమ్యూనిటీ హాల్స్, పర్యాటక స్థలాల్లో ఎంట్రీ ఫీజు, బోట్లలో ప్రయాణించేందుకు ఎంత రుసుం ఇలాంటి విషయాలు ఈ యాప్ ద్వారా ఎక్కడి నుంచైనా తెలుసుకోవచ్చు. ఈ యాప్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన పలు ప్రదేశాలను చేర్చారు.

యాప్‌ను ఇలా డౌన్‌లోడ్ చేసుకోండి

తెలంగాణ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ సర్వీసెస్ డెలివరీ వారు రూపొందించిన ‘మీ టికెట్’ యాప్‌ను ముందుగా ప్లేస్టోర్ నుంచి డౌన్లోడ్ చేసుకోవాలి. అనంతరం ఫోన్ నంబర్ నమోదు చేసి అకౌంట్‌లో పిన్ నంబర్ జనరేట్ చేసుకోవాలి. మొబైల్‌కు ఓటీపీ వస్తుంది. ఓటీపీని నమోదు చేసిన ఫోన్ నంబర్, పిన్ నంబర్ కొట్టి లాగిన్ కావాలి. లాగిన్ కాగానే అందులోని అన్ని అంశాలు మనకు కనిపిస్తాయి.

ఈ యాప్ లో ఏముంటాయంటే..

మీ టికెట్ యాప్ ద్వారా అన్ని రకాల టికెట్లను ఒకే ఫ్లాట్‌ఫాం పైకి తెచ్చారు. తెలంగాణలోని 15 ప్రముఖ దేవాలయాలు, 129 పార్కులు, 54 బోటింగ్ ప్రదేశాలు, జంతు ప్రదర్శనశాలలు, మెట్రో, ఆర్టీసీ, మ్యూజియాలు, ప్లే అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ జోన్స్‌కు సంబంధించి టికెట్లు తీసుకునే వెసులుబాటు కల్పించారు.

ఉమ్మడి జిల్లాలో చోటు కల్పించిన ప్రదేశాలు..



- బోటింగ్ విభాగంలో నాగార్జునసాగర్‌లో బోట్ల ప్రయాణాలకు సంబంధించి నాగార్జునకొండకు వెళ్లేందుకు, జాలీట్రిప్స్‌కు పిల్లలకు పెద్దలకు టికెట్ రేట్ల వివరాలు, మిర్యాలగూడలోని చెరువులో బోటింగ్ రేట్ల వివరాలను మీటికెట్ యాప్‌లో ఉంచారు.
- నాగార్జునసాగర్‌లో బుద్ధవనంలో పార్కింగ్ ఫీజు, ప్రవేశ రుసుం (పిల్లలకు పెద్దలకు) వివరాల ఉన్నాయి.



యాప్‌లో చేర్చాల్సినవి..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రస్తుతం మీటికెట్ యాప్‌లో యాదగిరిగుట్ట నృసింహుడి ఆలయాన్ని మాత్రమే ఉంచారు. ఇంకా చాలా ప్రసిద్ధిగాంచిన దేవాలయాలు, దర్శనీయ ప్రదేశాలు ఉన్నాయి. వాటిని కూడా ఈ యాప్‌లో చేర్చాల్సి ఉంది. నల్లగొండలోని ఛాయా, పచ్చల సోమేశ్వరాలయాలు, వాడపల్లి, నాగార్జునసాగర్, మట్టపల్లి, ఉండ్రుగొండ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాలు, పిల్లలమర్రి శివాలయాలు, చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయంతోపాటు.. నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలం వెళ్లే లాంచీ వివరాలు, నాగార్జునసాగర్‌లోని విజయవిహార్ వివరాలను యాప్‌లో నమోదు చేస్తే ఎంతోమందికి ఉపయోగంగా ఉంటుంది.



ఆలయాలకు సంబంధించి యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం వివరాలు యాప్‌లో ఉన్నాయి. ఇక్కడ అన్నప్రసాద వితరణ, నిజాభిషేకం, ప్రసాదాల రుసుం, అర్చన, హోమం, పూజ,సేవ, వ్రతం, బ్రహ్మోత్సవం, దర్శనం వివరాలను, టికెట్ల రేటను ఈ యాప్ ద్వారా తెలుసుకోవడంతోపాటు టికెట్లను కొనుగోలు చేసుకోవచ్చు.

క్లుప్తంగా

తాటి చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

వలిగొండ: మండలంలోని గోకారం గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు మద్దెల సత్తయ్య ఆదివారం తాటి చెట్టు ఎక్కే క్రమంలో ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి పడ్డాడు. దీంతో అతడి కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. సత్తయ్యను భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స నిర్వహించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా అందజేయాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు మద్దెల రాజయ్య, గాజుల ఆంజనేయులు ప్రభుత్వాన్ని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

పెద్దవూర: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన పెద్దవూర మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గుర్రంపోడు మండలం బొల్లారం గ్రామానికి చెందిన నిమ్మల సతీష్ ఆదివారం ముసలమ్మచెట్టు గ్రామం నుంచి పెద్దవూరకు తన ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో మండల కేంద్రంలోని వై జంక్షన్ సమీపంలో మల్లిఖార్జున ఫంక్షన్ హాల్ వద్ద హాలియా వైపు నుంచి వస్తున్న లారీ సతీష్ బైక్‌ను వెనక నుంచి ఢీ కొట్టింది. దీంతో లారీ టైర్లు సతీష్ కుడి చేతిపై నుంచి వెళ్లడంతో పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. అటుగా వెళ్తున్న వాహనదారులు గమనించి 108 వాహనానికి ఫోన్ చేసి సమాచారం అందించడంతో చికిత్స నిమిత్తం నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. సతీష్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వీరబాబు తెలిపారు.

బైక్ అదుపుతప్పి వృద్ధుడు మృతి

మర్రిగూడ: ద్విచక్రవాహనం అదుపుతప్పి వృద్ధుడు మృతిచెందిన సంఘటన మర్రిగూడ మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మునగాల కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం లోయపల్లికి చెందిన బూడిద రాములు(70) నాంపల్లి మండలంలోని వడ్డెపల్లిలో ఉంటున్న తన కోడలు, పిల్లలను చూసేందుకుగాను సాయంత్రం సమయంలో గ్రామం నుంచి బయలుదేరాడు. చర్లగూడెం, రాంరెడ్డిపల్లి గ్రామాల మూలమలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడడంతో రాములు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉండగా చిన్న కుమారుడు మృతిచెందాడు. పెద్ద కుమారుడు బూడిద ఎల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుక్కల దాడిలో 14 గొర్రెలు మృతి

మోటకొండూర్: మండలంలోని మాటూర్ గ్రామానికి చెందిన జెన్నె చిన్న భిక్షపతికి చెందిన గొర్రెలను పాకలో తోలగా శనివారం రాత్రి కుక్కలు దాడి చేశాయి. దీంతో 14గొర్రెలు మృతి చెందగా 10 గొర్రెలు గాయపడ్డాయి. ఈమేరకు భిక్షపతి అధికారులకు సమాచారం ఇవ్వటంతో ఆర్‌ఐ రామారావు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా చేశారు. గొర్రెల విలువ సుమారు రూ.1.5 లక్షలు ఉంటాయని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

నేనున్నానంటూ.. ఆపదలో భరోసా

- సామాజిక సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న తుంగతుర్తి గ్రామానికి చెందిన యువకుడు
- ప్రాణదాత ఫౌండేషన్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాల నిర్వహణ
- ఇప్పటి వరకు ఎన్నో అవార్డులు, ప్రశంసా పత్రాలు అందుకున్న రాజ్



అనాథలైన చిన్నారులకు ఆర్థికసాయం చేస్తున్న ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రాజ్, ప్రతినిధులు (ఫైల్)

కేతేపల్లి: కేతేపల్లి మండలంలోని తుంగతుర్తి గ్రామానికి చెందిన మేరుగుమళ్ల రాజ్ తన మిత్రులతో కలసి ప్రాణదాత ఫౌండేషన్ ఏర్పాటు చేసి సామాజిక సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాడు. ఎవరైనా ఆపదలో ఉన్నారంటే తక్షణమే స్పందిస్తూ వారిగా అండగా నిలుస్తున్నాడు.

ఒక్కడితో ప్రారంభమైన ఫౌండేషన్..

ఒక సంస్థగా ఏర్పడి సాయం చేస్తే బాగుంటుందని భావించిన రాజ్ 2020లో ప్రాణదాత ఫౌండేషన్ ఏర్పాటు చేశాడు. మొదట ఒక్కడితో ప్రారంభమైన ఫౌండేషన్ నేడు 200 మంది సభ్యులకు చేరుకుంది. అత్యవసర సమయంలో రక్తదానం చేయటం నుంచి ఆకలితో ఉన్న వారికి అన్నం సేకరించి అందజేయటం వరకు అన్ని రకాల సేవా కార్యక్రమాలను ప్రాణదాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేస్తున్నారు. అదేవిధంగా రక్తదాన శిబిరాలు నిర్వహించి దాతల నుంచి రక్తం సేకరిస్తున్నారు. జీవనోపాధి రీత్యా వివిధ వృత్తుల్లో కొనసాగుతూనే... ఆపదలో ఉన్నామని ఫోన్ చేసిన వారికి రక్తదానం చేస్తున్నారు.

సేవా కార్యక్రమాలు ఇలా..

- గర్భిణిలు, రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారు, అనారోగ్యంతో బాధపడుతున్న 3000 మందికి ఫౌండేషన్ తరుపున రక్తం ఇప్పించారు.
- ఫౌండేషన్ సభ్యులు తమ సంపాదన నుంచి ప్రతి నెలా రూ.200 జమచేసి, తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మిగిలిన నిరుపేద చిన్నారులు, వృద్ధులు, వింతంతులకు ఆర్థికసాయంగా అందజేస్తున్నారు.
- ఇప్పటి వరకు 30 కుటుంబాలకు ఫౌండేషన్ తరుపున ఆర్థికసాయం చేశారు.
- శుభ కార్యాలయాల్లో మిగిలిన అన్నం, కూరలను సేకరించి అనాథలకు పంపిణీ చేస్తున్నారు.
- రోడ్డుపై ఒంటరిగా ఉన్న వృద్ధులు, పిల్లలను చేరదీసి పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు.
- ప్రతి ఏటా వేసవిలో రహదారుల వెంట చలివేంద్రాలు ఏర్పాటు చేస్తూ వాహనదారుల దాహార్తిని తీరుస్తున్నారు.
- ఇటీవల వర్షాలతో ఖమ్మం, విజయవాడ నగరాల్లో వరదల్లో చిక్కుకున్న బాధితులకు ఆహారం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

34 సార్లు రక్తదానం చేశాను



కరోనా కాలంలో సకాలంలో రక్తం దొరకక ఎంతో మంది బాధితులు మృతిచెందడం నన్ను కలచి వేసింది. రక్తం దొరకక ఎవరూ మృతి చెందకుండా చూడాలనే ఆలోచనతో 2020లో మిత్రులతో కలసి ప్రాణదాత ఫౌండేషన్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. నేను ఇప్పటి వరకు 34 సార్లు రక్తదానం చేశాను. అత్యవసర సమయంలో ఫౌండేషన్ తరుపున 3వేల మందికి రక్తదానం చేశాం. మా స్నేహితులతో కలసి వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి రక్త దాతల ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచుతున్నాం. మేము సంపాదించిన దానిలో నుంచి నెలనెలా కొంత మొత్తాన్ని ఖర్చు చేస్తూ చేతనైనా సాయం చేస్తున్నాం.

– మేరుగుమళ్ల రాజ్, ఫౌండేషన్ వ్యవస్థాపకులు

ఉత్తమ సేవా అవార్డులు

ప్రాణదాత ఫౌండేషన్ పేరుతో రాజ్ చేస్తున్న సేవలకు గాను వివిధ సంస్థల నుంచి ఎన్నో అవార్డులు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు.

- మొదటగా 2022లో యాదాద్రి జిల్లా మోత్కూరులో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సేవా రత్న ఆవార్డు, ప్రశంసా పత్రం అందుకున్నారు.
- 2023లో ఉమ్మడి నల్లగొండ జిల్లా ఉత్తమ సేవారత్న అవార్డును రెండు సార్లు అందుకున్నారు.
- 2024లో హైదరాబాద్‌లో చిరంజీవి బ్లడ్‌బ్యాంక్ సంస్థ ఆధ్వర్యంలో ఉత్తమ సోషల్ వర్కర్ అవార్డు, డాక్టర్ వల్లబాయ్ పటేల్ జాతీయ స్ఫూర్తి పురస్కారం అందుకున్నారు.



జిల్లా ఉత్తమ సోషల్ వర్కర్ అవార్డు అందుకుంటున్న రాజ్ (ఫైల్)

లిఫ్ట్ పనులు వేసవిలోగా పూర్తి చేయాలి



జాన్‌పహాడ్ వద్ద లిఫ్ట్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

- భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- జాన్‌పహాడ్ శివారులో కృష్ణానదిపై నిర్మిస్తున్న లిఫ్ట్‌కు జవహర్‌లాల్ జాన్‌పహాడ్ లిఫ్ట్‌గా నామకరణం



వక్ఫ్‌బోర్డు అధికారులకు చెక్కు అందజేస్తున్న మంత్రి ఉత్తమ్

పాలకవీడు: మండలంలోని జాన్‌పహాడ్ శివారు కృష్ణానదిపై రూ.173 కోట్లతో చేపట్టిన సాగునీటి లిఫ్ట్ నిర్మాణ పనులు వేసవిలోగా పూర్తి చేయాలని భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. లిఫ్ట్ పనులను ఆదివారం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లిఫ్ట్‌కు జవహర్‌లాల్ జాన్‌పహాడ్ లిఫ్ట్‌గా నామకరణం చేశారు. మంత్రి మాట్లాడుతూ.. లిఫ్ట్ నిర్మాణం పూర్తయితే సుమారు 5650 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. పైప్‌లైన్ నిర్మాణానికి 20.23 హెక్టార్ల భూసేకరణ పూర్తయిందన్నారు. జాన్‌పహాడ్ సాగర మేజర్ ఎల్14 మైనరు కాల్వ వరకు పైప్‌లైన్ నిర్మాణాన్ని పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. బెట్టె తండా వద్ద మూసీనదిపై రూ.30 కోట్లతో మంజూరైన లిఫ్ట్ నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. శూన్యపహాడ్ వద్ద మూసీనదిపై గల లిఫ్ట్ సామర్థ్యాన్ని పెంచనున్నట్లు తెలిపారు. ఇప్పటికే మండలంలో రూ.9 కోట్లతో పాలకవీడు నుంచి అలింగాపురం వరకు, రూ.14 కోట్లతో అలింగాపురం నుండి గరిడేపల్లి వరకు డబుల్ రోడు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో మిర్యాలగూడెం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ హుస్సేనీ, కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, నీటిపారుదలశాఖ చీఫ్ ఇంజనీర్ రమేష్‌బాబు, నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు శంకర్‌రావు, ఆర్డీఓ శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ భూక్యా గోపాల్, జిల్లా నాయకులు మోతీలాల్, మండల అధ్యక్షుడు ఎన్‌వి.సుబ్బారావు, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సప్పిడి నాగిరెడ్డి, నరసింహారావు, నీమానాయక్, నేరేడుచర్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి, నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ ప్రకాష్ పాల్గొన్నారు.

ఉర్సు నిర్వహణపై అధికారులతో సమీక్ష

ఈ నెల 24నుంచి ప్రారంభమయ్యే జాన్‌పహాడ్ దర్గా ఉర్సుకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రూ. 30 లక్షలు మంజూరు చేశారు. ఈ చెక్కులను వక్ఫ్ బోర్డు అధికారులకు అందజేశారు. అనంతరం వక్ఫ్‌బోర్డు చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ, నీటిపారుదలశాఖ అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. పోలీస్, పంచాయతీ రాజ్, ఫైర్, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య, ఎక్సైజ్, ఆర్టీసీ అధికారులను సమన్వయం చేస్తూ నివేదికలు తెప్పించుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. అంతకుముందు జాన్‌పహాడ్ దర్గాలో ప్రార్థనచేశారు. వక్ఫ్ బోర్డు చైర్మన్ హుస్సేనీ మాట్లాడుతూ.. దర్గాలో మౌలిక సదుపాయాలకు రూ.1.30 కోట్లతో ప్రతిపాదనలు అందాయని దీనిని త్వరితగతిన మంజూరు చేయించి పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

యాదగిరి క్షేత్రంలో ఎంపీ లక్ష్మణ్ పూజలు



ఎంపీ లక్ష్మణ్‌కు శ్రీస్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారిని ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకొని, అష్టోత్తర పూజలు నిర్వహించారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీ లక్ష్మణ్, కుటుంబ సభ్యులకు అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, ఈఓ భాస్కర్‌రావు లడ్డూ ప్రసాదం, శ్రీస్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు.

ముంబై మారథాన్‌లో విజేతగా నిలిచిన కిషన్



వలిగొండ: మండలంలోని పొద్దటూర్‌కు చెందిన దుబ్బ కిషన్ ముంబైలో ఆదివారం టాటా వారు నిర్వహించిన మారథాన్‌లో పాల్గొని 42.195 కి.మీ పరుగు పందాన్ని 4గంటల 20 నిమిషాల 17 సెకండ్లలో పూర్తి చేసి ప్రథమ స్థానాన్ని సాధించారు. హైదారాబాద్‌లో ఇంటెలిజెన్స్ కంట్రోల్ రూంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న కిషన్ గతంలో హైదరాబాద్, ముంబై, కశ్మీర్ మారథాన్‌లో పాల్గొని మెడల్స్, ప్రశంసా పత్రాలు సాధించాడు. టాటా ముంబై మారథాన్‌లో విజేతగా నిలిచిన కిషన్‌కు పోలీస్ అధికారులు, మిత్రులు, బంధువులు అభినందనలు తెలిపారు.

సర్వేల్ గురుకుల పూర్వ విద్యార్థుల సంఘం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన పూర్వ విద్యార్థుల సంఘ కార్యవర్గం

సంస్థాన్ నారాయణపురం: సర్వేల్ గురుకుల పూర్వ విద్యార్థుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం హైదరాబాద్‌లో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా బూడిద నరేందర్ రెడ్డి తిరిగి ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్‌గా రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ, కోశాధికారిగా పురుషోత్తం, సంయుక్త కార్యదర్శులుగా విజయరాజు, మోహన్‌రెడ్డి ఎన్నికయ్యారు. అధ్యక్షుడు నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. సర్వేలు గురుకుల పాఠశాల విలువను పెంచేలా పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

బాలలను పనిలో పెట్టుకున్న ఇద్దరిపై కేసు నమోదు

భూదాన్‌పోచంపల్లి: బాలకార్మికులను పనిలో పెట్టుకున్న ఇద్దరు షాపు యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీ వరల్డ్ షాపులో బిహార్ రాష్ట్రానికి చెందిన బాల కార్మికుడితో పాటు, సురేశ్ బైక్ మెకానిక్ షాపులో మరో బాలకార్మికుడు పనిచేస్తున్నట్లు గుర్తించారు. ఈమేరకు షాపు యజమానులైన కొండాపురం భాస్కర్, చింతల సురేశ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

లలిత శతకం పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కసిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు

భూదాన్‌పోచంపల్లి: పట్టణ కేంద్రంలోని చేనేత టై అండ్ డై సిల్క్ చీరల ఉత్పత్తిదారుల సంఘం భవనంలో ఆదివారం జాతీయ తెలుగు సాహితీపీఠం (హైదరాబాద్) ఆధ్వర్యంలో పోచంపల్లికి చెందిన కవి వడ్డేపల్లి రాజేశ్వర్ రచించిన ×లలితా శతకం× పుస్తకాన్ని ఉస్మానియా విశ్వ విద్యాలయం తెలుగుశాఖ మాజీ అధ్యక్షులు, జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కసిరెడ్డి వెంకటరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేనేత కార్మికుడైన వడ్డేపల్లి రాజేశ్వర్ సాహితీ సేవలను కొనియాడారు. అనంతరం జాతీయ తెలుగు సాహిత్యపీఠం అధ్యక్షుడు డాక్టర్ నలవోలు నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఈనాటి పిల్లలకు పద్యాలు నేర్పుతూ శతకాలపై ఆసక్తి పెంచడానికి ఇలాంటి పుస్తకాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో తెలంగాణ మహిళా సాహిత్యసేవా సంస్థ అధ్యక్షురాలు రావూరి వనజ, పద్య కవయిత్రి రాపోలు అరుణ స్వామి, రాజనీతి ఉపాన్యాసకులు పట్నం కృష్ణకుమార్, రిటైర్డ్ అధ్యాపకుడు రావిరాల స్వామి, సీత శ్రీరాములు, రావూరి కృష్ణకుమార్, డాక్టర్ పాండాల మహేశ్వర్, రుద్ర పాండురంగ శాస్త్రి, త్రివేణి సాహితీసంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుంటి దయానంద్, గజ్జెల రామకృష్ణ, డాక్టర్ సుబ్బరామనాయుడు, విఘ్నేశ్వర్, చక్రాల నర్సింహ, మురళి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండలో బైక్ చోరీ

నల్లగొండ: కలెక్టరేట్ పక్కన పార్కు చేసి ఉన్న బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మిర్యాలగూడ రోడ్డుకు చెందిన వాడాల రవి తన బైక్‌ను కలెక్టరేట్ పక్కన జీరాక్స్ సెంటర్ ఎదుట ఉంచాడు. ఈ నెల 17న రాత్రి బైక్ చోరీకి గురికాగా.. బాధితుడు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రయాణికురాలికి ల్యాప్‌టాప్ అందజేత

నార్కట్‌పల్లి: బస్సులోనే ఉండిపోయిన ప్రయాణికురాలి ల్యాప్‌టాప్‌ను ఆర్టీసీ సిబ్బంది తిరిగి బాధితురాలికి అందజేశారు. ఆదివారం ఖమ్మం నుంచి వస్తున్న అఖిల సూర్యాపేట హైటెక్ బస్టాండ్‌లో బస్సు దిగింది. ఈ క్రమంలో తాను తిరిగి వచ్చేటప్పటికీ బస్సు వెళ్లిపోయింది. దీంతో తన ల్యాప్‌టాప్ బస్సులోనే ఉందని సూర్యాపేట డిపో మేనేజర్‌కు తెలిపింది. మేనేజర్ ఈ విషయాన్ని నార్కట్‌పల్లి డిపో అధికారులకు తెలియజేయడంతో వారు ఆ బస్సును నార్కట్‌పల్లిలో ఆపి అందులో ఉన్న ల్యాప్‌టాప్ బ్యాగును తీసుకుని దానిని బాధితురాలికి అందజేసినట్లు డిపో ఇన్‌చార్జ్ ఎంవీ చారి, కర్నాటి శ్రీనివాస్ తెలిపారు.



ప్రయాణికురాలికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

పూత నిలిస్తేనే మామిడి దిగుబడి

- ఈ సీజన్‌లో మామిడి తోటలపై అప్రమత్తంగా ఉండాలి
- హార్టికల్చర్ కన్సల్టెంట్ సుందరి సురేష్ సలహాలు





నడిగూడెం: ప్రతి ఏటా మామిడి పూత విరివిగా రావడం.. ఇంతలోనే మంచు కారణంగా పూత మాడిపోయి రాలిపోవడం సర్వసాధారణం. దీని వల్ల ఆశించిన దిగుబడి రాక రైతులు కుదేలవుతున్నారు. పూత నిలబడాలంటే సమగ్ర యాజమాన్యం తప్పనిసరి అని హార్టికల్చర్ కన్సల్టెంట్ సుందరి సురేష్ చెబుతున్నారు. మామిడి సాగులో పాటించాల్సిన జాగ్రత్తలు ఆయన మాటల్లోనే..

ప్రస్తుతం తోటలు పూత దశలో ఉన్నాయి. ఆ తర్వాత కాపునకు వస్తాయి. ఈ నెలలో తోటల్లో భూమిని చదును చేయాలి. దున్నాలి. దీని వల్ల కలుపు నివారణతో పాటు, చెట్లకు పూత రావడానికి సహకరిస్తుంది. తోటల్లో ఉండే పిండి పురుగులు, పండు ఈగ, కోశస్థ దశలో నశిస్తాయి. దుక్కులు సాలుకు అడ్డంగా దున్నాలి. తోటలో సాలును బట్టి ప్రతి 10 నుంచి 15 చెట్లకు పెద్ద అడ్డుకట్టలు వేయాలి. దీని వల్ల వర్షపు నీరు, సత్తువ బయటకు పోకుండా ఉంటుంది. నేలలో తేమ బాగా ఉంటుంది. ఎండు పుల్ల రాదు. వేరుకుళ్లు కూడా ఆశించదు.

సూక్ష్మపోషకాలు ఏటా అవసరం

మామిడితోటల్లో రకరకాల సూక్ష్మదాతులోపాలు కనిపిస్తాయి. కాయలు కోసిన తరువాత చెట్టు చక్కగా తయారు కావడానికి జింక్‌సల్ఫేట్ 5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఆ తరువాత సూక్ష్మదాతువులైన జింక్, మెగ్నీషియం, ఇనుము, బోరాన్,, మాంగనీస్, ద్రావణాన్ని తయారు చేసి కొత్త ఆకులు తొడిగే టప్పుడు వేయాలి.

ఎరువుల యాజమాన్యం

ముఖ్యంగా పొటాష్, భాస్వరం వేసుకుంటే మంచి ఫలితాన్నిస్తుంది. నత్రజని వేయకూడదు. నత్రజని ఎరువు వేయడం వలన ఆకులు పెరిగిపోతాయి తప్ప పెద్దగా ప్రయోజనం ఉండదు. చెట్ల వయస్సును బట్టి ఎరువులు వేయాలి. ఏడాది వయస్సు గల చెట్టు కుపశువుల ఎరువు లేదా వర్మి కంపోస్టు 10 కిలోలు, యూరియా 200 గ్రాములు, సూపర్ పాస్పేట్ 500 గ్రాముల ప్రకారం వేయాలి. రెండేళ్ల వయస్సున్న చెట్టు ఒక్కోదానికి పశువుల ఎరువు 20 కిలోలు, యూరియా 400 గ్రాములు, సూపర్‌పాస్పేట్ ఒక కిలో, పొటాష్ 300 గ్రాములు వేయాలి. పదేళ్ల చెట్టు ఒక్కోదానికి పశువుల ఎరువు 50 కిలోలు, యూరియా ఒక కిలో, సూపర్ పాస్పేట్ 2500 గ్రాములు, మ్యూరెట్ ఆఫ్ పొటాష్ 750 గ్రాములు వేయాలి. 10 ఏళ్ల, ఆపైన వయస్సు గల చెట్లకు ఒక్కోదానికి టన్ను పశువుల ఎరువు, యూరియా 2 కిలోలు, సూపర్ పాస్పేట్ 500 గ్రాములు, మ్యూరెట్ ఆఫ్ పొటాష్ 1500 గ్రాములు వేసుకోవాలి. ఈ ఎరువులన్నీ సమపాళ్లలోనే వేయాలి.

అసంతృప్తిని కప్పి పుచ్చుకునేందుకే ఎమ్మెల్యేలకు ఆఫర్

- మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్

మోత్కూరు: సీఎం రేవంత్‌రెడ్డి తనపై వస్తున్న అసంతృప్తిని కప్పి పుచ్చుకోవడానికి కమీషన్ల కోసం ఒక్కో ఎమ్మెల్యేకు రూ.5 కోట్ల మేర పనులను ఆఫర్ ఇచ్చారని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ ఆరోపించారు. ఆదివారం మోత్కూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వంలో ఆరు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నా భర్తీ చేయలేని అసమర్థ సీఎం రేవంత్‌రెడ్డి అని విమర్శించారు. ఆరు గ్యారంటీలు అమలు చేయాలని ప్రశ్నిస్తే పోలీస్ కేసుల బనాయింపు, అక్రమ అరెస్టులు, నిర్బంధాలు చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్, కేటీఆర్‌ను తిట్టడమే ధ్యేయంగా రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. ఈ ఫార్ములా అక్రమ కేసు బనాయించి కేటీఆర్‌ను అరెస్టు చేయాలనే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటి వరకు తుంగతుర్తి నియోజకవర్గంలో ఏ ఒక్క పైసా అభివృద్ధి పనులు చేయలేదన్నారు. తన హయాంలో జరిగిన అభివృద్ధి, మంజూరు పనులను తిరిగి కొబ్బరికాయ కొట్టి ప్రారంభిస్తున్నారని, శంకుస్థాపనలు చేస్తున్నారన్నారు. ఈ నెల 21న నల్లగొండలో జరిగే రైతు మహా ధర్నాకు రైతులు, పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో మదర్ డెయిరీ డైరెక్టర్ రచ్చ లక్ష్మినర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు తీపిరెడ్డి మేఘారెడ్డి, కొణతం యాకుబ్‌రెడ్డి, చిప్పలపల్లి మహేంద్రనాథ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు పొన్నబోయిన రమేష్, కె.ప్రభాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు జంగ శ్రీను, కార్యదర్శి గజ్జి మల్లేషం, నాయకులు బయ్యాని పిచ్చయ్య, సోంమల్లు, సత్యం గౌడ్, దాసరి తిరుమలేష్, బుషిపాక లక్ష్మి, దబ్బెటి శైలజ, ఇంద్రజ్యోతి పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ వయస్సు పెంపుపై స్పష్టత ఇవ్వాలి

- డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య



మాట్లాడుతున్న డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య

సూర్యాపేటటౌన్: ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 61 సంవత్సరాల నుంచి 63 సంవత్సరాలకు పెంచనున్నారని వస్తున్న ప్రచారంపై స్పష్టత ఇవ్వాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య, రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం సూర్యాపేటలోని సిటీ హైస్కూల్‌లో నిర్వహించిన సూర్యాపేట జిల్లా డీటీఎఫ్ వార్షిక కౌన్సిల్ సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం పదవీ విరమణ వయస్సు 58 సంవత్సరాల నుంచి 61 సంవత్సరాలకు పెంచడంతో అనేక మంది నిరుద్యోగులకు అన్యాయం జరిగిందని, వేలాది మంది ఉపాధ్యాయ ఉద్యోగులకు ప్రమోషన్ అవకాశాలు దెబ్బతిన్నాయన్నారు. సర్వీసులో ఉన్న వారి జీపీఎఫ్, పార్ట్ ఫైనల్, టీఎస్జీఎల్ఐ, మెడికల్, సరెండర్ లీవ్ బిల్లులు చాలా కాలంగా ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే వాటిని మంజూరు చేయాలన్నారు. సమావేశంలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లింగయ్య, వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, వేణు, ఆనంద్ భాస్కర్, రమణ, సిద్దిక్ పాషా, ప్రభాకర్, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

42ఏళ్ల తరువాత అపూర్వ కలయిక



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

తుంగతుర్తి: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన 1980 –81, 1981–82 టెన్త్ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన వారంతా 42 ఏళ్ల తరువాత ఒక్కచోట చేరి తమ చిన్ననాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. ఒకరినొకరు తమ, తమ క్షేమాలను తెలుసుకున్నారు. అనంతరం తమకు బోధించిన ఉపాధ్యాయులను మండల కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, ఆకారపు రామయ్య, పూర్వ విద్యార్థులు సంకినేని రవీందర్‌రావు, వర్దెల్లి శ్రీహరి, గుండగాని శ్రీహరి, రాధకృష్ణ, మేనేని వేణు, నిరంజన్‌రెడ్డి, సుమతీ, విష్ణు, కోదాటి వెంకన్న, బుద్ధ వీరయ్య, దాసు, బుద్ధ సోమయ్య, కర్ణాకర్, కాంతయ్య పాల్గొన్నారు.